క్లుప్తంగా

దేవనకొండ సీఐగా వంశీనాథ్



దేవనకొండ: యూపీఎస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వంశీనాథ్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కర్నూలు ఏసీబీ నుంచి దేవనకొండకు బదిలీపై వచ్చారు. నూతన సీఐ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే తనదృష్టికి తీసుకురావాలని, మధ్యవర్తులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ఆలూరులో ప్రచారం చేస్తున్న ప్రబోధ సమితి సభ్యులు

ఆలూరు రూరల్: పట్టణంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాలపై ఆదివారం ధర్మ ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ..శ్రీ కృష్ణ భగవానుడిని మాత్రమే ఊరేగించాలన్నారు. అయన్ను మాత్రమే అందరూ దైవంగా భావించాలని చెప్పారు. పూర్వం శ్రీ కృష్ణాష్టమి 11 రోజుల పాటు నిర్వహించే వారని, చవితి రోజున ఊరేగింపు చేసి వేడుకలు ముగించేవారని వివరించారు. గుంతకల్లు,నాగ సముద్రం కమిటీ అధ్యక్షులు కృష్ణమూర్తి, ధనుంజయ సభ్యులు దొనప్ప, శ్రీ వేణి, సర్వజ్ఞ, మల్లి,రాజేశ్వరి, చైతన్య,లక్ష్మి,సుధాకర్,రాము పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



బాధిత కుటుంబానికి సాయమందిస్తున్న స్నేహితులు

వెల్దుర్తి: తమ మిత్రుడు అకాల మరణం చెందడంతో ఆ కుటుంబానికి చేయూతనందించారు స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో 10వ తరగతి వరకు (1996-97 బ్యాచ్) కలిసి చదివిన పూర్వ విద్యార్థులు. పట్టణానికి చెందిన శివరామిరెడ్డి ఇటీవల గుండెపోటుతో మరణించాడు. మృతుడి కుటుంబ పరిస్థితి తెలుసుకున్న పూర్వ విద్యార్థులు రూ.72వేలు పోగుచేసి ఆదివారం మృతుని ఇంటి వెళ్లి, అతని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి.. ఆ మొత్తాన్ని మృతుడి భార్యకు అందజేశారు. తమ వంతుగా అన్ని రకాలుగా కుటుంబానికి చేదోడుగా ఉంటామని భరోసానిచ్చారు. చిరంజీవి, మాధవస్వామి, కటికె ఖాజా, నాగరాజు, రహ్మతుల్లా, వెంకటేశ్, శేషు, చంద్రశేఖర్, శివకుమార్, రమణ, వీరేశ్ ఉన్నారు.

రాజగోపురానికి విరాళం

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి ఆదివారం భక్తులు విరివిగా విరాళాలు అందజేసి తమ భక్తిని చాటుకున్నారు. ఆదోని పట్టణ వాస్తవ్యులు మీనాక్షమ్మ తన భర్త అలసందగుత్తి సాయినాథ్‌రెడ్డి జ్ఞాపకార్థం రూ.లక్షను దేవాలయ కార్యాలయంలో ఆదివారం అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ హెచ్.జి వెంకటేష్ తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలను, పూలమాల, స్వామి వారి శేష వస్త్రాలు, లడ్డులు, బాండు, ఫొటోను అందజేశారు.

సరైన పత్రాలు చూపించి వాహనాలు తీసుకెళ్లండి

ఆదోని అర్బన్: ఆదోని వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 12-12-2023న సీఆర్ నం.213/2023 యూ/ఎస్ 102 సీఆర్‌పీసీ కింద కేసు నమోదైన వాహనాలను యజమానులు సరైన పత్రాలను చూపించి తీసుకెళ్లాలని వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ ఆదివారం తెలిపారు. కొద్ది రోజుల తర్వాత వాహనాలను వేలం వేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. మొత్తం 20 మోటార్ సైకిళ్లు ఆయా కేసుల్లో పట్టుబడ్డాయన్నారు. వాటి యజమానులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ధ్రువ పత్రాలు చూపించాల్సి ఉంటుందన్నారు.

దశమి ఉత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో నల్లరెడ్డి స్వామి

గోనెగండ్ల : మండల కేంద్రంలో వెలసిన భక్తుల పాలిట కొంగు బంగారంగా పేరొందిన శ్రీశ్రీ ఆదిచింతలాముని రంగడు, నల్లారెడ్డి స్వాముల దశమి మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలకు రాష్ట్రం నుంచే కాక తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివస్తున్నారు. ఉత్సవాలకు గట్టి బందోబస్తును ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ ఉపేంద్ర బాబు తెలిపారు. ఆదివారం సీఐ గంగాధర్‌తో కలిసి స్వాములను దర్శించుకుని ఏర్పాట్లను పరిశీలించారు.

క్రీడా పోటీలకు వేళాయె

- 24న నియోజకవర్గ స్థాయిలో స్కూల్ గేమ్స్ ఎంపికలు

పత్తికొండ(తుగ్గలి) : విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు పాఠశాల స్థాయి క్రీడా పోటీలు వేదికగా నిలుస్తున్నాయి. ఇప్పటికే మండల స్థాయిలో పోటీలు నిర్వహించారు. మంగళవారం నియోజకవర్గ స్థాయిలో నిర్వహించనున్నారు. ఇందులో ఎంపికైన వారు జిల్లా స్థాయిల్లో పోటీలు ఆడనున్నారు. అక్కడ ప్రతిభ కనబరిచిన వారికి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించేందుకు అవకాశం కల్పిస్తారు. నియోజకవర్గ స్థాయిలో పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేయడంలో వ్యాయామ ఉపాధ్యాయులు నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా నియోజకవర్గానికి సంబంధించి ఆరు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. మండల స్థాయి పోటీల్లో ఎంపికైన వారు నియోజకవర్గ స్థాయిలో పాల్గొనున్నారు. పోటీల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తుండగా..పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు మధ్యాహ్న భోజన సదుపాయాన్ని కల్పించనున్నారు.



ఖోఖోలో సాధన చేస్తున్న క్రీడాకారులు

24న జరగనున్న పోటీలు..

పత్తికొండ జూనియర్ కాలేజీ మైదానంలో నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. 24న అండర్ 14, 17 విభాగాల్లో బాల, బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా, షటిల్ బాల్ బ్యాడ్మింటన్, చెస్ క్రీడా ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. పోటీలను ఎమ్మెల్యే కేఈ శ్యాం బాబు ప్రారంభించనున్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ పాఠశాల హెచ్ఎంల నుంచి అవసరమైన అర్హత పత్రాలను తీసుకురావాల్సి ఉంటుంది.

ఏర్పాట్లు పూర్తి



విద్యార్థుల్లో దాగిఉన్న క్రీడా ప్రతిభను నిరూపించుకేందుకు స్కూల్ గేమ్స్ దోహదపడుతున్నాయి. పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులు జిల్లా స్థాయిలో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత కల్పిస్తారు. జాతీయ స్థాయి పోటీల్లో రాణించిన క్రీడాకారులకు మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.

– చందూనాయక్, ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ కోఆర్డినేటర్

24 నుంచి 'పొలం పిలుస్తోంది'

కృష్ణగిరి: మండలంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని ఎట్టకేలకు ఈ నెల 24 నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఏఓ వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. వారంలో మంగళవారం కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఈ నెల 24వ తేదీన టి.గోకులపాడు గ్రామంలో కార్యక్రమం నిర్వహించి పంటలసాగుపై రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలిస్తామని చెప్పారు.

ప్రతి రైతు ఈ-కేవైసీ చేయించుకోవాలి

ఖరీఫ్‌లో పంట నమోదు చేయించుకున్న ప్రతి రైతు ఈ-కేవైసీ తప్పక చేయించుకోవాలని ఏఓ వెంకటేశ్వర్లు కోరారు. పంట నమోదుకు సోమవారం తో గడువు ముగుస్తుందని ఈ విషయాన్ని రైతులు గుర్తించి పంట నమోదుతో పాటు, ఈ- కేవైసీ చేయించుకోవాలని సూచించారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు దరఖాస్తు చేసుకోండి

కృష్ణగిరి: మండలంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్)ను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ-2 మద్దయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఈ నెల 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందులో ఎంపికైన విద్యార్థులకు 9, 10 తరగతులతో పాటు ఇంటర్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే ఏడాదికి రూ.12వేల స్కాలర్‌షిప్ వస్తుందని పేర్కొన్నారు.

రైల్వే స్టేషన్.. పేరుకే!



నంచర్ల గ్రామంలో ఉన్న మల్లప్ప గేట్ రైల్వే స్టేషన్

- నంచర్ల గ్రామానికి రెండు రైల్వే స్టేషన్లు
- ఒకటి గ్రామంలో.. మరొకటి 5కి.మీ. దూరంలో ఏర్పాటు
- ఒక్క రైలూ నిలపని వైనం
- గుంతకల్లుకు సమీపంలో ఉన్నా.. బస్సు నోచుకోని గ్రామం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



నూతన రైల్వే స్టేషన్ ప్రారంభం రోజున రైళ్లు ఆపాలని వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు (ఫైల్)

చిప్పగిరి: ఆ గ్రామానికి రెండు రైల్వే స్టేషన్లు. ఒకటి గ్రామంలో ఉండగా.. మరొకటి ఊరికి 5కి.మీ. దూరంలో ఉంది. పల్లెకు దూరంగా ఉండటంతో ఈ స్టేషన్‌తో ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. ఇంకొకటి గ్రామంలోనే ఉన్నా.. ఒక్క రైలును కూడా నిలపరు. దీంతో అది నిరుపయోగంగా మారింది. మండలంలోని నంచర్ల గ్రామంలో 2,500 మంది ఓటర్లు ఉన్నారు. కర్నూల్ జిల్లా సరిహద్దు ప్రాంతం కావడంతో బస్సు సౌకర్యం కూడా లేదు. అనంతపురం జిల్లా గుంతకల్లుకు 10 కి.మి దూరంలో ఉండే ఈ గ్రామానికి గుంతకల్లు డిపో నుంచి ఎలాంటి బస్సు సర్వీసులు ఏర్పాటు చేయలేదు. సుమారు 40 సంవత్సరాల క్రితం విధి నిర్వహణలో మల్లప్ప అనే రైల్వే ఉద్యోగి ఉత్తమ సేవలకు గుర్తింపుగా మల్లప్ప గేట్‌ను నంచర్లలో ఏర్పాటు చేశారని గ్రామస్తులు చెబుతున్నారు. అప్పటి నుంచి ప్యాసింజర్ రైళ్లన్నీ ఆపేవారు. ఇలా 2020 వరకు రైలు సేవలను గ్రామస్తులు పొందారు. అయితే కరోనా సమయంలో పలు రైళ్లను రద్దు చేసిన రైల్వే అధికారులు ఆ తరువాత అన్ని ప్రాంతాల్లో సర్వీసులను పునరుద్ధరించారు. కానీ నంచర్ల గ్రామంలోమాత్రం రైళ్లు ఆగడం లేదు. ఇటు బస్సులు లేక, మరోవైపు రైళ్లు నిలపకపోతుండటంతో గ్రామస్తులు ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో వారి ఇబ్బందులు వర్ణనాతీతం. కాగా..గతేడాది మల్లప్ప గేట్‌ను ఆధునీకరించి నూతనంగా నిర్మించడంతో భవనం ప్రారంభం రోజున గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివెళ్లి రైలు సర్వీసులు పునరుద్ధరించాలని కోరుతూ రైల్వే ఉన్నతాధికారులకు వినతి పత్రం అందజేశారు. అయితే నేటికీ సర్వీసులు అందుబాటులోకి రాక పోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దూర ప్రయాణాలకు ఇబ్బంది పడుతున్నాం



మా గ్రామంలో యువకులు , ప్రజలు చాలా మంది ఉపాధి ,ఉన్నత విద్య కోసం, హైదరాబాద్ ,బెంగళూర్,నంద్యాల,కర్నూల్,అనంతపురం తదితర ప్రాంతాలకు నిత్యం వందలాదిగా రాకపోకలు సాగిస్తుంటారు. రైలు సౌకర్యం లేక పోవడంతో తిప్పలు పడుతున్నారు. గ్రామ ప్రజల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని రైల్వే అధికారులు కనీసం ప్యాసింజర్ రైళ్లనైనా ఆపి మా ప్రయాణ కష్టాలు తీర్చాలి.

– శివలింగ, నంచర్ల

రైల్వే స్టేషన్‌లు ఉండి ప్రయోజనం లేదు



మా గ్రామానికి ఎలాంటి బస్సు సౌకర్యం అందుబాటులో లేదు దీంతో ప్రయాణాలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గతంలో ప్యాసింజర్ రైళ్లు ఆగుతుండటంతో ఇబ్బందులు ఉండేవి కాదు. గతంలో మాదిరి ఇప్పుడు ఆ సేవలను పునరుద్ధరిస్తే దాదాపు ప్రయాణ కష్టాలు తీరతాయి. ఒక్క రైలు కూడా ఆగకుండా ఉండటం వల్ల గ్రామంలో రైల్వే స్టేషన్ ఉండి కూడా నిరుపయోగమే.

– భీమ, సర్పంచ్, నంచర్ల



మిద్దె తండా వద్ద తడిసిన సజ్జ కంకులతో రైతుల అవస్థలు

తడిచిన సజ్జ దిగుబడి

తుగ్గలి : వర్షంతో చేతికొచ్చిన సజ్జ పంట తడిచిపోయింది. పది రోజులుగా సజ్జ కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి పలు గ్రామాల్లో సజ్జ దిగుబడి తడిసిపోయింది. మరికొన్నిచోట్ల వేరుశనగ కట్టె కూడా పొలాల్లో తడిచిపోయింది. దిగుబడులు తడవడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఈ వర్షం కొందరు రైతులకు నష్టం మిగల్చగా, మరి కొన్ని పంటలకు లాభం చేకూరింది.

ముగిసిన తిక్కతాత ఆరాధన

వెల్దుర్తి: పట్టణ సమీపంలోని తిక్కతాత ఆలయ సమూహంలో రెండు రోజుల పాటు జరిగిన తిక్క నరసింహయ్య తాత ఆరాధన ఆదివారం ముగిసింది. ముగింపు రోజు స్వామి వారి దర్శనం, అన్నసంతర్పణ, పూజాది కార్యక్రమాలు జరిగినట్లు నిర్వాహకుడు వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు వెల్దుర్తి జానకిరామ నాటక కళా సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా ప్రదర్శించిన నాటక ప్రదర్శన భక్తులను అలరించింది.

మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు జరిగాయి. పూజారులు మూల విరాట్‌లకు తెల్లవారుజామున సుప్రభాతం సేవ, అభిషేకాలు, బండారార్చన, కుంకుమార్చన, మహామంగళ హారతి, నైవేద్య సంతర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా జరిపించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. వారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

వీఆర్వోల బదిలీ

మద్దికెర : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పలువురు వీఆర్వోలు బదిలీ కాగా మరి కొందరికి స్థాన చలనాలు కల్పించినట్లు కలెక్టర్ కార్యాలయం నుంచి ఆదేశాలు అందాయని రెవెన్యూ అధికారులు ఆదివారం తెలిపారు. రంగస్వామి మండల పరిధిలోని హంప- 1, శివన్న బసినేపల్లి, శ్రీరాములు మద్దికెర-1, అబ్దుల్ రషీద్ బురుజుల, లక్ష్మి ఆదోని అర్బన్, వన్నూర్ నేమకల్లుకు బదిలీ అయ్యారు.

వెల్దుర్తిలో 62.4 మి.మీ వర్షపాతం నమోదు

వెల్దుర్తి: శనివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు మండలంలో కురిసిన వర్షపాతం 62.4 మి.మీలుగా నమోదైనట్లు ఏఎస్ఓ అభిమన్యు ఆదివారం తెలిపారు. కుండపోతగా మండలంలో కురిసిన వర్షంతో పుల్లగుమ్మి, కలుగొట్ల, రామళ్లకోట వీధులు జలమయమవగా, ఆయా గ్రామాలతో పాటు బోయనపల్లె గ్రామ పరిధిలోని పొలాల్లో నీరు నిలిచి పంటకు నష్టం కలిగించింది. మండలంలో కురిసిన వర్షం అధిక శాతం పంటలకు ఊపిరి పోసిందని ఏఓ అక్బర్ బాషా తెలిపారు.

దొంగ పట్టివేత

మద్దికెర : మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామ జగనన్న కాలనీలో ఆదివారం తెల్లవారుజామున దొంగను పట్టుకున్నారు. ఓ ఇంట్లోకి చొరబడటాన్ని గమనించిన మహిళలు కేకలు వేయడంతో కాలనీ వాసులు దొంగను పట్టుకొని పోలీసులకు అప్పగించినట్లు గ్రామస్తులు తెలిపారు. దొంగ ఒడిశా, తెలుగు భాషలు మాట్లాడుతున్నాడని, విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌శంకర్ నాయక్ తెలిపారు.

అభివృద్ధి పనులకు వ్యతిరేకం కాదు

ఆలూరు: నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలన్నదే తన లక్ష్యమని, ఇందుకోసం రాజకీయాలకు అతీతంగా పోరాడతానని, అంతే తప్ప తాను అభివృద్ధికి వ్యతిరేకం కాదని ఎమ్మెల్యే బి.విరుపాక్షి తెలిపారు. ఆదివారం స్థానిక వాసవీ కల్యాణ మండపం ఆవరణలో నిర్వహించిన సెమినార్‌కు కొన్ని కారణాల వల్ల హాజరు కాలేకపోయానన్నారు.హామీలిచ్చిన నాయకులు, ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలు

హొళగుంద: మండలంలోని చిన్నహ్యాట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన గోపి అనే పదేళ్ల బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. గోపి గ్రామంలోని ఆలూరు-హొళగుంద రోడ్డు దాటుతుండగా అటువైపు వెళ్తున్న బొలేరో, క్రూయిజర్ వాహనాలు ఒకదానికొకటి ఓవర్ టేక్ చేసుకునే సమయంలో బాలుడిని ఢీ కొట్టినట్లు గ్రామస్తులు తెలిపారు. వెంటనే కుటుంబ సభ్యులు హొళగుంద పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం బళ్లారికి తరలించినట్లు చెప్పారు.

వంద రోజుల్లో ప్రజల్ని ముంచిన ప్రభుత్వం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ పులికొండనాయక్

తుగ్గలి : కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వంద రోజుల్లో ప్రజలకు మంచి చేయకపోగా, అన్ని వర్గాలను ముంచిందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జిట్టా నాగేష్‌యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్, మాజీ సభ్యుడు నారాయణనాయక్, రాంపల్లి సర్పంచ్ మహీంద్ర విమర్శించారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. ప్రజలకు ఏమి చేశారని మంచి ప్రభుత్వం అవుతుందని ప్రశ్నించారు. అమ్మ ఒడి కాపీ కొట్టి తల్లికి వందనం అన్నారు. స్కూళ్లు తెరిచి మూడు నెలలు దాటినా ఒక్క తల్లి ఖాతాలోనైనా నగదు జమ అయ్యిందా ప్రశ్నించారు. ఉచితంగా ఇసుక ఇస్తున్నామని ఊదరగొడుతున్నా.. అది ఎక్కడ ఇస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. మూడు నెలల్లో పాలకుల అసమర్థత ఏమిటో బయట పడిందని.. బాబు మాటలు నీటి మూటలని మరోసారి రుజువైందన్నారు. సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రశ్నించే అవకాశముందని గ్రహించి శ్రీవారి లడ్డు ప్రసాదాలపై కూడా దుష్ప్రచారం చేయడం సిగ్గు చేటన్నారు. నిత్యావసరాలు, కూరగాయల ధరలు పెరిగి పేదలు కొనలేని స్థితిలో ఉన్నారన్నారు. ఇప్పటికైనా దుష్ప్రచారాలు మాని ఇచ్చిన హామీలు నెరవేర్చాలని హితవు పలికారు. కృష్ణానాయక్, రాజు పాల్గొన్నారు.

ఆలూరు నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతాం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ నాగరాజు

ఆలూరు: నియోజకవర్గంలో నెలకొన్న తాగు, సాగునీరు,రోడ్లు, డ్రైనేజీల సదుపాయాలే కాకుండా ప్రారిశ్రామిక హబ్ ఏర్పాటు, అభివృద్ధి పనులను చేసేందుకు బాధ్యత తీసుకుంటామని కర్నూల్ ఎంపీ బస్తిపాడు నాగరాజ్, పత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వీరభద్రగౌడు హామీ ఇచ్చారు. స్థానిక వాసవీ కల్యాణ మండపం ఆవరణలో ఆదివారం పాత్రికేయులు , అధికారులు, ప్రజాప్రతినిధులు అభివృద్ధిపై సెమినార్ నిర్వహించారు. ఎంపీ, ఎమ్మెల్యే , బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెంకటరాముడు తదితరులు మాట్లాడారు. ఆరు మండలాల్లో ప్రజలకు కనీస సదుపాయాలు, వేదావతి నదిపై ప్రాజెక్టు, నగర డోణ రిజర్వాయర్ పనులను పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. బీఎస్పీ నాయకుడు రామలింగయ్య, వివిధ మండలాలకు చెందిన సీపీఐ, సీపీఎం నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

కార్యాలయం ఆలూరులో.. విధులు గుంతకల్లులో!



మూతపడిన హెచ్చెల్సీ డీఈ కార్యాలయం

- 2008లో ఆలూరులో హెచ్చెల్సీ డీఈ కార్యాలయం ఏర్పాటు
- భవనం శిథిలమవడంతో ఖాళీ చేసిన అధికారులు
- గుంతకల్లు జీబీసీ కార్యాలయానికి అనధికారికంగా తరలింపు
- అక్కడి నుంచే విధులు
- ఇబ్బందులు పడుతున్న రైతులు

ఆలూరు: తుంగభద్ర బోర్డు పరిధిలో ఆలూరు సబ్ బ్రాంచ్ ఎగువ కాలువ 2వ సబ్‌డివిజన్ కార్యాలయాన్ని 2008లో ఆయకట్టు రైతులు, సాగునీటి సంఘాల అధ్యక్షులు, టీసీ మెంబర్లు, ప్రజల విజ్ఞప్తి మేరకు అనంతపురం జిల్లా గుంతకల్లు నుంచి ఆలూరుకు మార్చారు.హెచ్చెల్సీ కాలువ నుంచి నియోజకవర్గంలో దాదాపు 14,500 ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించాలి. ఇందులో 19 డీపీలు ఉన్నాయి. 230 క్యూసెక్కుల సాగునీటిని కాలువకు విడుదల చేయాలని ఇంజినీర్లు ఆధునీకరణ చేశారు. ఆయకట్టు రైతులకు సాగునీటి సమస్యలను తెలుసుకునేందుకు డీఈ, ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, లస్కర్లు, తదితరులు అందుబాటులో కార్యాలయంలోనే విధులు నిర్వహించేవారు. అయితే క్రమేణా కార్యాలయం శిథిలమవడంతో కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది మొత్తం గుంతకల్లులోని జీబీసీ కార్యాలయానికి అనధికారికంగా తరలివెళ్లారు. వారితో పాటు రికార్డులు, కార్యాలయ ఫర్నీచర్, సామగ్రిని కూడా తరలించారు. దీంతో పేరుకు మాత్రమే డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ కార్యాలయం-2గా మిగిలిపోయింది. సాగునీరు విడుదల, డీపీల మరమ్మతు పనులు, జంగిల్ క్లియరెన్స్ తదితర అంశాలతో పాటు ఆయకట్టు రైతులు కాలవ సమాచారాన్ని తెలుసుకోవడానికి గుంతకల్లుకు వెళ్లాల్సి వస్తుందని రైతులు , సాగు నీటిని సంఘాల టీసీ మెంబర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని హెచ్చెల్సీ డీఈ మంజునాథ్‌ను విచారించగా.. కార్యాలయం ఉంది. కానీ భవనం పాత పడటంతోనే గుంతకల్లులోని జీబీసీలో ఏబీసీ కార్యాలయాన్ని కొనసాగిస్తున్నామని సమాధానమిచ్చారు.



స్త్రీ శక్తి భవనం ప్రధాన ద్వారం వద్ద ధ్వంసమైన మెట్లు

ఇది కార్యాలయమే!

- స్త్రీశక్తి భవనంలో తిష్ట వేసిన సమస్యలు
- కనీస సౌకర్యాలు కరువు
- కుంగిన బండపరుపు
- మరుగుదొడ్లకు డోర్లు లేని వైనం
- మంచినీటికి కటకట
- ఇబ్బందులు పడుతున్న పొదుపు మహిళలు, సిబ్బంది

హాలహర్వి: ఇదేదో పాడుబడిన భవనమనుకుంటే పొరపాటే.. మండల కేంద్రంలో పొదుపు మహిళల కోసం నిర్మించిన స్త్రీ శక్తి భవనం. 2015లో రూ.30లక్షలతో నిర్మించారు. నాడు కనీస సౌకర్యాలు కల్పించకపోవడం, నిర్మాణంలో నాణ్యత లోపించడంతో శిథిలావస్థకు చేరింది. ఇక సౌకర్యాలు లేకపోవడంతో సిబ్బంది, పొదుపు మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు నిర్మించినా నీటి సౌకర్యం కల్పించలేదు. కార్యాలయం లోపల ఉన్న గదులకు తలుపులు లేవు. అలాగే గదుల్లో వేసిన బండపరుపు కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. భవనం ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన మెట్లు ధ్వంసం కావడంతో పాడుబడిన బంగ్లాను తలపిస్తుంది. ఇక సమావేశాలు నిర్వహించినప్పుడు మహిళలు అవస్థలు వర్ణనాతీతం. కనీసం తాగునీటి వసతి లేకపోవడం ఆశ్చర్యకరం. సమావేశాలు నిర్వహించిన సమయంలో దాదాపు 50 మందికి వరకు పొదుపు మహిళలు హాజరవుతారు. వచ్చిన వారికి మరుగుదొడ్ల సౌకర్యం సక్రమంగా లేకపోవడం, వాటికి తలుపులు లేక అత్యవసరాలకు చెప్పుకోలేని బాధ అనుభవిస్తున్నారు. ఇక స్త్రీశక్తి భవనానికి వచ్చే రహదారికి ఇరువైపులా ముళ్లకంపలు పెరిగిపోయాయి. ప్రహరీ కూడా లేదు. దీంతో సమస్యలకు నిలయంగా మారింది. మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలిపినా చర్యలు చేపట్టిన పాపాన పోలేదు.





భవనం లోపలి గదుల్లో బండ పరుపు ఇలా..